దర్పణ్‌తో.. ఆ పిల్లలకు విముక్తి

ఆపరేషన్ స్మైల్ సమీక్షలో డీసీపీ సృజన కర్ణం

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): తప్పిపోయిన పిల్లలు, వివిధ కారణాలతో కుటుంబాల నుంచి విడిపోయిన పిల్లలను 'దర్పణ్' అనే ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌తో గుర్తించి వారి కుటుంబాలకు అప్పగిస్తున్నామని మహిళా, శిశు సంరక్షణ విభాగం డీసీపీ సృజన కర్ణం తెలిపారు. సైబరాబాద్ కమిషనరేట్‌లోని సోమవారం నిర్వహించిన ఆపరేషన్-11 సమీక్షలో సృజన మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 1నుంచి 31వరకు నెలరోజులపాటు ఆపరేషన్ స్మైల్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా వెట్టిచాకిరీ చేస్తున్న బాలకార్మికులు, భిక్షాటన చేస్తున్న చిన్నారులు, ట్రాఫికింగ్‌కు గురైన పిల్లలను గుర్తిస్తున్నామన్నారు. అంతే కాకుండా తప్పిపోయిన పిల్లలను ముఖ గుర్తింపు సాఫ్ట్‌వేర్‌తో గుర్తించి వారి కుటుంబాలకు అప్పగిస్తున్నామని చెప్పారు. ఆపరేషన్ స్మైల్ కోసం కమిషనరేట్ పరిధిలో మొత్తం 11 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని ఒక్కో బృందంలో ఒక ఎస్ఐ స్థాయి అధికారితో పాటు ఒక మహిళా కానిస్టేబుల్, మరో ముగ్గురు కానిస్టేబుళ్లు ఉంటారని వివరించారు. ఆపరేషన్ స్మైల్‌పై సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టి, కుటుంబాలకు దూరమైన చిన్నారులను చేరదీసి, తిరిగి వారి కుటుంబాలకు అప్పజెప్పేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మహిళా, శిశు సంరక్షణ విభాగం ఏసీపీ వి.ప్రసన్నకుమార్, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ప్రతినిధి కె.నరేందర్‌రెడ్డి, బచ్పన్ బచావో ఆందోళన్ స్టేట్ కోఆర్డినేటర్ అందె వెంకటేశ్వర్లు, జిల్లా శిశు సంరక్షణ అధికారులు ఎండి.ఇంతియాజ్, రత్నం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కందుకూరు, జనవరి 6 : నగర శివారులోని కందుకూరులో ఓ రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కందుకూరు పోలీసుల కథనం ప్రకారం వివరాలు నాగర్‌కర్నూల్ జిల్లా తాండూరు మండలం బాలన్నపల్లి గ్రామానికి చెందిన చిన్నయ్య కుమారుడు భరత్ (20)తో పాటు రైతులు కొమ్ము దయాకర్, పసుపుల కుమార్, మనకూరి రమేశ్, గోనెల సాయి, డ్రైవరు శివకుమార్ యొక్క బొలెరో వాహనంలో హైదరాబాద్‌లో ఎండు మిర్చి అమ్మడానికి బయలుదేరారు. వారు స్వగ్రామం నుంచి ఆదివారం రాత్రి దెబ్బడగూడ గేటు సమీపంలోకి రాగానే కందుకూరు నుంచి కడ్తాల్ వైపు వెలుతున్న కారు అజాగ్రత్తగా వచ్చి బోలెర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న భరత్ మృతి చెందాడు. మిగిలిన రైతులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియ దవాఖానకు తరలించి కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నిఘా గాలికొదిలేసి.. భద్రత పట్టు సడలి..

2024లో 41 శాతం పెరిగిన నేరాలు.. తొలి 8 నెలల్లో భారీగా కేసుల నమోదు

అదుపు తప్పిన పెట్రోలింగ్
రాత్రి వేళల్లో రెచ్చిపోయిన నేరగాళ్లు
విమర్శలతో తేరుకుని సీపీలను బదిలీ చేసిన ప్రభుత్వం

డిసెంబర్ నెలాఖరులో... శాంతిభద్రతల వార్షిక నివేదికను వెల్లడించిన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): శాంతిభద్రతల విషయంలో ఆదర్శవంతమైన రికార్డు నమోదు చేసిన హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ 2024లో మాత్రం అభాసుపాలైంది. ప్రాథమిక పోలీసింగ్‌ను గాలికి వదిలేయడం, నిరంతర నిఘాలో విఫలమవడం, పెట్రోలింగ్ అదుపు తప్పడం వంటి కారణాలతో శాంతి భద్రతల నిర్వహణలో అనేక వైఫల్యాలు స్పష్టమయ్యాయి. 2024 సంవత్సరంలో దాదాపు 41 శాతం అధికంగా నేరాలు పెరగడమే ఇందుకు సాక్ష్యం. అందులోనూ తొలి 8 నెలల్లో భారీగా నేరాలు నమోదయ్యాయి. ఆ తర్వాత చివరి 4 నెలల్లో ఈ పరిస్థితి కొంత మెరుగుపడినా నగర పౌరుల నుంచి హైదరాబాద్ పోలీసులు అనేక విమర్శలు ఎదుర్కోక తప్పలేదు.

2024లో 35944 కేసులు

2023లో హైదరాబాద్ నగరంలో 25488 కేసులు నమోదు కాగా, 2024లో 35944 కేసులు నమోదయ్యాయి. 2023తో పోలిస్తే ఇది 41 శాతం అధికం. ఉన్నతాధికారులు సిటీ పోలీసింగ్‌ను గాలికి వదిలేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత హైదరాబాద్ సీపీగా శ్రీనివాస్ రెడ్డిని నియమించారు. ఆయన రావడంతోనే సిటీ పోలీసింగ్‌లో ప్రక్షాళన మొదలుపెట్టారు. అయితే ప్రక్షాళన పర్వంలో పెట్రోలింగ్, నిఘా వంటి కీలక అంశాలను విస్మరించినట్టు తెలుస్తున్నది. పెట్రోలింగ్ వ్యవస్థలో ఎన్ని వాహనాలున్నాయి? ఎన్ని పనిచేస్తున్నాయి? రాత్రి వేళల్లో సిబ్బంది ఎక్కడెక్కడ పనిచేస్తున్నారు? అనే అంశాలను పక్కన పెట్టేశారు. దీంతో సుమారు 210 పెట్రోలింగ్ వాహనాలు నిత్యం తిరుగాల్సిన చోట, 60 శాతం మాత్రమే పెట్రోలింగ్ వాహనాలు తిరుగుతున్నా ఆ విషయంపై దృష్టి పెట్టలేదనే విమర్శలున్నాయి. సెల్‌ఫోన్ స్నాచింగ్‌లు, హత్యలు జరిగినా సమయానికి పెట్రోలింగ్ వాహనాలు ఘటనా స్థలికి చేరుకోలేని పరిస్థితి నెలకొంది. గుడి మల్కాపూర్‌లో సెల్‌ఫోన్ స్నాచర్లు హత్యకు కూడా పాల్పడటంతో ఆ సమయంలో పెట్రోలింగ్ వాహనం సరైన సమయానికి రాలేదని, అప్పటి ఉన్నతాధికారులు సైతం అసహనం వ్యక్తం చేశారు. సౌత్, సౌత్ వెస్ట్, వెస్ట్, సౌత్ ఈస్ట్, ఈస్ట్ ఇలా అన్ని జోన్లలో పరిస్థితి చేయి దాటి పోయింది. రాత్రి పూట గస్తీని గాలికి ఒదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో నేరాలు భారీగా జరిగాయి. రౌడీ షీటర్ల హత్యలు, సెల్‌ఫోన్ స్నాచింగులు పెరిగాయి. ఎందుకు పరిస్థితి చేయి దాటిపోయిందో అర్థం చేసుకోలేని పరిస్థితుల్లో ఉన్నతాధికారులు ఉన్నారనే విమర్శలు రావడం, దీంతో వాటిని అధిగమించేందుకు ఏకంగా డెకాయ్ ఆపరేషన్లు చేసి నేరస్థులపై కాల్పులు చేశారు. తమ సొంత ఆలోచనలను సిబ్బందిపై రుద్దేందుకు ప్రయత్నించడంతో క్షేత్ర స్థాయిలో కొంతమంది సిబ్బంది పనిచేయకుండా చేతులెత్తేశారు. ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక ఏకంగా కొందరు మూకుమ్మడి సెలవులు పెట్టాలని, మరి కొందరు ఒక్కసారిగా ఆందోళనకు దిగాలని, ఇంకా కొందరు అవసరమైనప్పుడు శాంతి భద్రతల పరిరక్షణను గాలికి ఒదిలేస్తే, అందరు దిగి వస్తారనే ఆలోచనలు సైతం చేసినట్లు పోలీసు విభాగంలో చర్చ జరిగింది. ఇదే సమయంలో హైదరాబాద్‌లో హత్యలు, దొంగతనాలు, దోపిడీలు పెరిగిపొయ్యాయని కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే రాష్ట్ర రాజధాని బ్రాండ్ ఇమేజ్ దెబ్బ తీశారంటూ అటూ ప్రతిక్షం, ప్రజలు గొంతెత్తడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. పైగా 2024లో జనవరి నుంచి ఆగస్టు వరకు మొదటి ఎనిమిది నెలల్లో ఎక్కువగా కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే సిటీ సీపీగా వ్యవహరించిన శ్రీనివాస్‌రెడ్డిని బదిలీ చేసి ఆయన స్థానంలో నగరంపై పూర్తి పట్టు కలిగిన సీనియర్ ఐపీఎస్ సీవీ ఆనంద్‌కు బాధ్యతలు అప్పగించారు.

గాడిన పడేనా..

తొలి 8 నెలల్లో భారీగా నేరాలు పెరిగిపోవడంతో ప్రభుత్వం ఆందోళనకు గురైంది. శాంతిభద్రతల విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతాయనే విషయాన్ని గుర్తించి పోలీసింగ్‌ను గాడిలో పెట్టేందుకు గతంలో సీపీగా పనిచేసి ఏసీబీ చీఫ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్‌కు హైదరాబాద్ పగ్గాలు మరోసారి అప్పగించారు. సిటీ పోలీసింగ్‌పై పూర్తి పట్టున్న ఆయన బాధ్యతలు చేపట్టగానే వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేస్తూ, ఎందుకు నేరాలు పెరుగుతున్నాయని క్షేత్ర స్థాయిలో ఆరా తీశారు. ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లో పనిచేసిన అధికారులు ఇతర ప్రాంతాలకు, ఇతర ప్రాంతాలలో పనిచేసిన వారు హైదరాబాద్‌కు బదిలీలపై వచ్చారు. హైదరాబాద్ పోలీసింగ్‌పై వారికి సరైన అవగాహన లేదని గుర్తించారు. జోన్ల వారీగా సమీక్షలు నిర్వహిస్తూ ఎక్కడక్కెడ లోపాలున్నాయని గుర్తించి వాటిని సరిచేస్తూ పనిచేస్తున్న సిబ్బందికి సిటీ పోలీసింగ్‌పై అవగాహన కల్పిస్తూ, మూడు నెలలుగా సిటీ పోలీసింగ్‌ను గాడిలో పెడుతూ వచ్చారు. ఈ నేపథ్యంలోనే పెట్రోలింగ్ వ్యవస్థను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తూ వాటి పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నేరాలు చివరి మూడు నెలలు తగ్గుముఖం పడుతూ వచ్చాయి. ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన సిబ్బంది సిటీకి బదిలీపై రావడం, వారికి సిటీ పోలీసింగ్‌పై పూర్తి అవగాహన లేకపోవడంతో కొద్దిగా 2024లో నేరాలు పెరిగాయని సిటీ పోలీసింగ్ వార్షిక నివేదిక విడుదల సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ వెల్లడించిన విషయం తెలిసిందే.

హైడ్రాలో ప్రజావాణి

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): హైడ్రాలో మొదటిసారి ప్రయోగాత్మకంగా చేపట్టిన వారం వారం ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరిగింది. చెరువులు, పార్కులు, ప్రభుత్వస్థలాలు, నాలాల ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను రాణిగంజ్ బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయంలో కమిషనర్ రంగనాథ్ ప్రజల నుంచి నేరుగా స్వీకరించారు. ఉదయం పదకొండు గంటలకు మొదలైన ప్రజావాణి రాత్రి ఎనిమిదిగంటల వరకు కొనసాగింది. ఫిర్యాదు దారులకు మొదట టోకెన్లు ఇచ్చి వాటి ప్రకారమే కమిషనర్ ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం యాభై టోకెన్లే ఇచ్చినప్పటికీ మొత్తం 83 ఫిర్యాదులను స్వీకరించినట్లు హైడ్రా బృందం తెలిపింది. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడుతూ అక్కడే ఉన్న అడ్వకేట్, హైడ్రా అధికారులను సంబంధిత సమస్యపై చర్చించారు. దీంతో ప్రతీ ఫిర్యాదు తీసుకోవడంలో కొంత ఆలస్యమైంది. ప్రధానంగా లేఔట్లు, పార్కులు, నాలాల కబ్జాలతో పాటు తమ స్థలం ఎఫ్‌టిఎల్‌లో ఉన్నదా.. బఫర్‌లో ఉన్నదా అని అడిగిన వారే ఎక్కువగా ఉన్నారు. అంతేకాకుండా తమ స్థలాన్ని వేరేవారు కబ్జా చేశారంటూ కొంత మంది ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు తీసుకునే క్రమంలో అసలు సమస్య ఏమిటి.. ఏ ప్రాంతానికి చెందినది.. పూర్తి వివరాలు తెలుసుకుని అక్కడే ఉన్న ఆ ప్రాంతానికి చెందిన తమ ఇన్‌స్పెక్టర్లకు అప్పగించారు. వారంలోగా ఆ ఫిర్యాదుపై సమగ్ర నివేదిక ఇవ్వాలని, మూడువారాల్లో సంబంధిత ఫిర్యాదుకు సంబంధించిన చర్యలుంటాయని రంగనాథ్ తెలిపారు. తనకు ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలంతో పాటు పార్కు స్థలాన్ని కూడా స్థానికంగా ఉన్న ఒక మహిళ కబ్జా చేసిందని,, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని ఇండోపాక్‌వార్‌లో పాల్గొన్న విశ్రాంత సైనికుడు పి.సీతారామరాజు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. వరద నీరు వచ్చిచేరే లోతట్టు ప్రాంతంలో పేదవారు ఇల్లు కొనుక్కొని మోసపోతున్నారని ఉప్పల్ నియోజకవర్గం చిలకానగర్ కార్పొరేటర్ భర్త ప్రవీణ్ ముదిరాజ్ హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

గండిపేటలో తమకు సంబంధించిన ఐదువందల గజాల స్థలం ఎఫ్‌టిఎల్ లేదా బఫర్‌జోన్‌లో ఉందా అని అడగడానికి వచ్చిన రఘునందన్ అనే వ్యక్తికి అక్కడ ఉన్న కుంటల చిత్రాలు చూపించిన హైడ్రా అధికారులు అతని స్థలం చెరువుల హద్దుల్లో లేదని చెప్పి హెచ్ఎండీఏ నుంచి లేఔట్‌కు సంబంధించిన వివరణ తీసుకోవాలని చెప్పారు. సోమవారం ఉదయం పదకొండు గంటల నుంచి రాత్రి ఎనిమిదిగంటల వరకు హైడ్రా కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ రంగనాథ్, హైడ్రా అధికారులతో సహా పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వాటికి సంబంధించి మూడువారాల్లో చర్యలు తీసుకుంటామని చెప్పారు.

బాధితుల సమస్యలను ఓపికగా వినండి

సానుభూతితో వ్యవహరించండి
రాచకొండలో కొత్త సంవత్సర వేడుకల్లో సిబ్బందికి సీపీ సుధీర్‌బాబు దిశానిర్దేశం

నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో సోమవారం కేక్ కట్ చేస్తున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): వివిధ రకాల సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో అధికారులు, సిబ్బంది సానుభూతితో వ్యవహరించాలని, వారి సమస్యను ఓపికగా విని స్నేహపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందికి రాచకొండ సీపీ సుధీర్ బాబు సూచించారు. కొత్త సంవత్సరంలో రెట్టింపు ఉత్సాహంతో సిబ్బంది నూతనోత్సాహంతో పనిచేయాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో డీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయిలో అధికారుల వరకు, మినిస్టీరియల్ స్టాఫ్‌తో కలిసి సోమవారం నూతన సంవత్సరం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి వరకు అందరు నూతన క్రిమినల్ చట్టాల గూర్చి సంపూర్ణ పరిజ్ఞానం కల్గి ఉండాలని, నూతన చట్టాల అమలులలో ఎదురవుతున్న అవరోధాలను ఎప్పకటిప్పుడు ఉన్నతాధికారులకు తెలుపాలని వివరించారు. రాష్ట్రంలో త్వరలోనే స్థానిక సంస్థలు, పంచాయితీలకు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా వారి వారి పరిధిలో తగిన ముందస్తు జాగ్రత్తలు మొదలు పెట్టాని ఆదేశించారు. అనంతరం రాచకొండ కమిషనరేట్‌కు చెందిన అంబర్‌పేట్‌లోని కార్ హెడ్ క్వార్టర్స్‌లోను జరిగిన వేడుకలలో సీపీ సుధీర్‌బాబు పాల్గొన్నారు.

అటవీ శాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపకమిషనర్ రవికుమార్

చైనా మాంజా అమ్మకాలను అడ్డుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, జనవరి 6: మనుషుల ప్రాణాలను బలిగొంటూ, పక్షులకు ఉరితాడుగా మారిన సింథటిక్ నైలాన్ చైనా మాంజా అమ్మకాలను అడ్డుకోవాలని రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉపకమిషనర్ రవికుమార్ సూచించారు. అత్తాపూర్‌లోని చింతకుంట పార్కులో సింథటిక్ నైలాన్ గ్లాస్ కోటెడ్ మాంజాపై అటవీ శాఖ రూపొందించిన పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అత్యంత ప్రమాదకరమైన చైనా మాంజా నిషేధం అమలుకు పౌర సంఘాలు, ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ప్రజలతో పాటు పక్షుల ప్రాణాలను హరిస్తున్న చైనా మాంజా అమ్మకాలను, వాడకాన్ని అడ్డుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు మ్యాడం మధుసుధన్, నారగూడెం మల్లారెడ్డి, మోంద్ర కొమురయ్య, జె.జగన్‌మోహన్‌రెడ్డి, నల్లింగ్ రమేష్, సాబాద విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంధ్యా థియేటర్ యజమాని రామ్‌రెడ్డికి బెయిల్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : పుష్పా-2 ప్రీమియర్ షో ఘటనలో సంధ్యా థియేటర్ యజమాని ఆగమాటి రామ్‌రెడ్డి అలియాస్ పెద్ద రామ్‌రెడ్డి, సోదరుడు చిన్న రామ్‌రెడ్డిలకు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. నటుడు అల్లు అర్జున్ 11వ నిందితుడిగా పోలీసులు నమోదు చేశారు. ప్రధాన నిందితులుగా పేర్కొనబడిన పెద్ద రామ్‌రెడ్డి, చిన్న రామ్‌రెడ్డిలకు 25వేలు చొప్పున ఇద్దరి పూచీకత్తులను కింది కోర్టు 9వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ కోర్టులో సమర్పించాలని పేర్కొంది. ప్రతి ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరై సంతకం చేయాల్సి ఉంటుందని ఆదేశాలు జారీ చేస్తూ 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జీ వినోద్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

కౌశిక్‌రెడ్డి అనుచరుల ముందస్తు అరెస్ట్‌లు

శేరిలింగంపల్లి, జనవరి 6 : గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలోని కొండాపూర్ రాఘవేంద్ర కాలనీ సిల్వర్ కీ ఓయో లాడ్జిలో హుజూరాబాద్ శాసన సభ్యులు పాడి కౌశిక్‌రెడ్డి అనుచరులను గుర్తించిన పోలీసులు సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. రెండు లాడ్జిలలో 38 మందిని గుర్తించామని, హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కౌశిక్‌రెడ్డి అనుచరులుగా గుర్తించి ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు గచ్చిబౌలి పోలీసులు తెలిపారు.

అల్లు అర్జున్ కిమ్స్‌కు వస్తే అభ్యంతరం లేదు: పోలీసులు

బేగంపేట్, జనవరి 6 : సినీనటుడు అల్లు అర్జున్ సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి వస్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని నగర పోలీసులు తెలిపారు. అయితే, ముందస్తుగా సమాచారం ఇవ్వాలని రాంగోపాల్‌పేట్ పోలీసులు ఆయనకు నోటీసు జారి చేశారు. అల్లు అర్జున్ ఇంటికి వెళ్ళగా ఆయన అందుబాటులో లేకపోవడంతో మేనేజర్‌కు దానిని అందజేసినట్టు ఎస్సై నర్సింగ్‌రావు తెలిపారు. సంధ్యా థియేటర్ సంఘటనలో గాయపడిన శ్రీతేజ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఆ బాలుడిని పరామర్శించడానికి అల్లు అర్జున్ రావాలనుకుంటే తమకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని, తాము తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు. ముందుగా ప్రచారం జరగడం వలన పెద్ద ఎత్తున అభిమానులు ఆస్పత్రికి వచ్చే అవకాశం ఉన్నదని, దాని వలన మరోసారి శాంతిభద్రతల సమస్య ఏర్పడుతుందని పోలీసులు అన్నారు.

గోవా మద్యం పట్టివేత

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): గోవా నుంచి నగరానికి రైలులో తరలిస్తున్న రూ.2లక్షల విలువైన నాన్‌డ్యూటీ పెయిడ్ మద్యంను ఆబ్కారీ ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. గోవాలో మద్యం ధరలకు తక్కువగా ఉండడంతో చాలా మంది అక్కడికి వెళ్లిన పర్యాటకులు పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేసి నగరానికి తీసుకువస్తున్నారు. అయితే ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రానికి మద్యం తీసుకురావడం నిషేదం. అయినప్పటికీ నిబంధలనకు విరుద్ధంగా కొంత మంది గోవా నుంచి పెద్ద ఎత్తున నగరానికి మద్యం తీసుకువస్తున్నారు. దీంతో గోవా నుంచి వచ్చే బస్సులు, రైళ్లు, ప్రైవేటు వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టి తనిఖీలు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే గోవా నుంచి సికింద్రాబాద్ వస్తున్న వాస్కోడీగామా రైలులో సోమవారం తనిఖీలు చేపట్టారు. షాద్‌నగర్ నుంచి సికింద్రాబాద్ వరకు రైలులోని ఏసీ బోగీలలో చేపట్టిన తనిఖీల్లో పలువురి వద్ద నుంచి రూ.2లక్షల విలువ చేసే 82మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌టిఎఫ్ పోలీసులు తెలిపారు. ఎస్‌టిఎఫ్ సిఐలు నాగరాజు, వెంకటేశ్వర్లు నేతృత్వంలో జరిపిన ఈ తనిఖీల్లో 20మంది సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఎన్‌డిపిఎల్ మద్యం పట్టుకున్న వీరిని ఆబ్కారీ ఈడీ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

మల్లాపూర్ రోడ్డుపక్కకు దూసుకెళ్లిన వాహనం

వాహనాలపైకి దూసుకెళ్లిన జీహెచ్ఎంసీ వాహనం

మల్లాపూర్, జనవరి 6 : నాచారం పోలిస్టేషన్ పరిధి మల్లాపూర్‌లో సోమవారం జీహెచ్ఎంసీ రోడ్ క్లీనింగ్ వాహనం అదుపు తప్పింది. వాహనాన్ని రోడ్డుపై ఆపి డ్రైవర్ కిందికి దిగాడు. ఈ క్రమంలో అదుపు తప్పిన వాహనం రోడ్డు దాటి పక్కన వున్న బైక్‌లు వాహనాలపైకి దూసుకెళ్లింది. దీంతో వాహనాన్ని ఆపే ప్రయత్నంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో రెండు బైక్‌లు కారు స్వల్పంగా ధ్వంసమయ్యాయి.

ట్రేడింగ్ పేరుతో 12 లక్షలు బురిడీ

సిటీబ్యూరో, జనవరి 6 (నమస్తే తెలంగాణ): ట్రేడింగ్‌లో సీనియర్ కన్సల్టెంట్‌గా చెప్పుకొని ఓ సైబర్‌నేరగాడు ఇద్దరిని 12 లక్షల రూపాయలు మోసం చేశాడు. ట్రేడింగ్‌కు సంబంధించిన టిప్స్‌ను వాట్సాప్‌లో సూచిస్తామంటూ మెసేజ్‌ల ద్వారా నమ్మించడంతో అందుకు స్పందించిన నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి రూ.2.3 లక్షలు, బాధితుడు రూ.10 లక్షల వరకు నష్టపోయారు. ముందు వెబ్‌సైట్ లింక్‌ను పంపించారు. అనంతరం సైబర్‌నేరగాళ్లు తయారు చేసిన యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, ఆ యాప్ ద్వారా దఫదఫాలుగా బాధితుల నుంచి పెట్టుబడులు పెట్టించారు. పెట్టిన పెట్టుబడికి యాప్‌లో రెట్టింపు లాభాలు కన్పిస్తున్నా, వాటిని విత్ డ్రా చేసుకునే పరిస్థితి లేకపోవడంతో ఇదంతా మోసమని గుర్తించిన బాధితులు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ట్రాఫిక్ హోంగార్డును దుర్భాషలాడినందుకు..

కుత్బుల్లాపూర్, జనవరి 6 : అల్వాల్‌లో విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డు ఎ.బాల్‌దాస్‌ను దుర్భాషలాడినందుకు పేట్ బషీరాబాద్ పోలీసులు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 5, ఆదివారం సాయంత్రం కొంపల్లిలో అపర్ణ గ్రీన్ స్కేప్ ఎదురుగా అల్వాల్ ట్రాఫిక్ హోంగార్డు ఎ.బాల్‌దాస్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా ప్రవీణ్ అనే వ్యక్తి బైకుపై రాంగ్‌రూట్లో హెల్మెట్ లేకుండా వస్తుండగా బాల్ దాస్ ఫొటో తీశారు. దీంతో కోపోద్రిక్తుడైన ప్రవీణ్ బాల్‌దాస్‌ను దూషించి విధులకు ఆటంకం కల్పించాడు. అదే సమయంలో అతిగా మద్యం సేవించి ఉన్నట్లు తేలింది. దీంతో పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షాపింగ్ బిల్లు రూ. 1433 బ్యాగులో ఉన్నది రూ. 10556

బంజారాహిల్స్, జనవరి 6 : షాపింగ్ మాల్‌కు వచ్చిన మహిళ వేలాది రూపాయల విలువైన సామగ్రిని తస్కరించేందుకు యత్నించిన ఘటన ఫిలింనగర్ పోలీస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. టోలిచౌకి ప్రధాన రహదారిపై ఉన్న రిలయన్స్ మార్ట్‌లో షాపింగ్ కోసం సబా ఫాతిమా అనే మహిళ తన కొడుకుతో కలిసి వచ్చింది. తాను కొనుగోలు చేసిన వస్తువులతో బయటకు వెళ్లేందుకు యత్నిస్తున్న సబా ఫాతిమాను అపిన సెక్యూరిటీ సిబ్బంది ఆమె కొనుగోలు చేసిన సామగ్రిని తనిఖీ చేయడంతో పాటు బిల్లును పరిశీలించారు. అమె చెల్లించిన బిల్లు కేవలం రూ.1433 మాత్రమే ఉండగా ఆమె బ్యాగులో సుమారు రూ.10,556 విలువైన వస్తువులున్నాయని గుర్తించారు. సెక్యూరిటీ గార్డుల దృష్టి మరల్చి సామగ్రిని తస్కరించేందుకు యత్నించిన సబా ఫాతిమా వద్దనుంచి సామగ్రిని వెనక్కితీసుకున్నారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురయిన సబా ఫాతిమా షాపుకు చెందిన సెక్యూరిటీ సిబ్బందితో గొడవకు దిగారు. ఆమె భర్త కూడా అక్కడికి వచ్చి సిబ్బందిని దుర్భాషలాడారు. ఈ మేరకు రిలయన్స్ మార్ట్ స్టోర్ మేనేజర్ శ్రీనివాసులు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సబా ఫాతిమాతో పాటు ఆమె భర్త సైపుద్దీన్ అలీ, కొడుకు మహ్మద్ రహీమ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇన్‌స్టాలో పరిచయం.. ఇంట్లో అఘాయిత్యం

బాలికపై బాలుడి లైంగిక దాడి
తప్పటడుగులు వేయించిన సోషల్‌మీడియా

వెంగళరావునగర్, జనవరి 6 : తెలిసీ తెలియని ప్రాయంలోనే సోషల్ మీడియా దుష్ప్రభావానికి లోనై ఓ బాలుడు..బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఇన్‌స్టాలో పరిచయంతో ఇద్దరి మధ్య పెరిగిన చనువు వికృత చేష్టలకు దారి చూపింది. మధురానగర్‌లో పధ్నాలుగేళ్ల బాలిక పై పద్దెనిమిదేళ్ల బాలుడు అత్యాచారానికి ఒడిగట్టిన ఘటన కలకలం రేపుతున్నది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్ కర్నూల్‌కు చెందిన ఓ చిరు వ్యాపారి కుటుంబం రహ్మత్ నగర్‌లో నివాసం ఉంటున్నది. నాగర్‌కర్నూల్ పట్టణానికే చెందిన ఓ బాలుడు నగరంలోని తన బాబాయ్ ఇంట్లో ఉంటూ ఆటోలో సహాయకుడిగా వెళ్తుంటాడు. సోషల్ మీడియాలో బాలుడు యాక్టివ్‌గా ఉండేవాడు. ఏడాది క్రితం ఇన్‌స్టాలో పరిచయమైన బాలికకు ఫ్రెండ్